సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 11 । నవంబర్ । 2024



నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి జి.స్వామి (అమలాపురం) రూ.50,101, జి.సత్యనారాయణ (రాజమండ్రి) రూ.51,116 చొప్పున విరాళాలు సమర్పించారు.




దేవుని సాక్షిగా దోపిడీ..

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో దేవుని సాక్షిగా దోపిడీ జరుగుతోంది. వాహనాల పార్కింగ్ పేరుతో భక్తుల నుంచి అధికంగా వసూలు చేయడం గమనార్హం.

8లో

44 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 44,130 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.35 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 5,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఇసుక ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు

రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: సామాన్యులకు, భవన నిర్మాణ కార్మికులకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోందని, ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. ఈ అంశంపై ఆయన నియోజకవర్గ ప్రజలకు ఆదివారం వీడియో సందేశం పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొంత మంది అత్యాశపరులు ఇసుకను ఉచితంగా కాకుండా స్వలాభం కోసం ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. నిర్ణయించిన ధరకు మించి, ఎక్కువకు అమ్మడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కువ ధరకు ఇసుక అమ్మినా, వేర్వేరు పేర్లు ఉపయోగించి ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు చెప్పినా ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. ఇసుక పూర్తిగా ఉచితమని, రవాణా, తవ్వకానికి మాత్రమే ధర చెల్లించాలని స్పష్టం చేశారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు.

104 సిబ్బంది ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 సిబ్బంది

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ 104 సిబ్బంది ఆదివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ 104 సంఘం గౌరవాధ్యక్షుడు పూర్ణిమ రాజు మాట్లాడుతూ, 104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరిగా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన వేతన బకాయిలను విడుదల చేయాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి, జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో అధ్యక్షుడు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ దర్శనం.. భక్తజనం పావనం

మామిడికుదురు: పవిత్ర కార్తిక మాసం ఆదివారం శ్రీబాల బాలాజీ స్వామి దర్శనంతో భక్తజనం పావనం అయ్యింది. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి పాత ఆలయంతో పాటు నవీన ఆలయం రద్దీగా మారింది. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు.

ఉచితంగా దోపిడీ

- సొమ్ము ఇచ్చుకో.. ఇసుక పట్టుకో!
- అధికారుల సమక్షంలోనే దళారీల దందా
- లారీ ఇసుకకు రూ.5 వేలు అ'ధనం'
- డబ్బులిస్తేనే ట్రాక్టర్లకు లోడింగ్



తీపర్రు ర్యాంప్‌లో గుట్టల నుంచి పొక్లెయిన్‌తో ఇసుక ఎగుమతి



తీపర్రు ర్యాంప్‌లో ఇసుక కోసం క్యూలో ఉన్న లారీలు

పెరవలి: ప్రభుత్వ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఉచిత ఇసుక.. దళారీలకు కాసులు కురిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. దీంతో వారి కళ్లెదుటే లారీ డ్రైవర్ల నుంచి అక్రమార్కులు అదనపు సొమ్ము గుంజుకుంటున్నారు. ఇసుక గుట్టల వద్ద 20 టన్నుల లారీ ఇసుకను రూ.6,500కు అమ్ముకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అమ్మకాలకు పొంతన లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పెరవలి మండలం కానూరు–పెండ్యాల, తీపర్రు ఇసుక ర్యాంపుల్లో ఈ తంతు యథేచ్ఛగా సాగుతోందని చెబుతున్నారు.

అధికారిక రేటు ఎంతంటే..

జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న 17 ఓపెన్ రీచ్‌లను అధికారులు గుర్తించారు. వీటికి టెండర్లు పిలిచి, తక్కువకు కోట్ చేసిన వారికి ఆయా రీచ్‌లు అప్పగించారు. ఇసుక ఉచితం కాగా, బాట, లోడింగ్ చార్జీలను ఒక్కో రీచ్‌కు ఒక్కో రకంగా జిల్లా అధికారులు ధరలు నిర్ణయించారు. కానూరు–పెండ్యాల ర్యాంప్ వద్ద రూ.68.96, తీపర్రు–2లో రూ.96.02, జీడిగుంట ర్యాంప్‌లో రూ.81.32గా ఈ ధరలు ప్రకటించారు. దీని ప్రకారం 20 టన్నుల లారీ ఇసుకకు కానూరు–పెండ్యాల ర్యాంప్‌లో రూ.1,380, తీపర్రు ర్యాంప్‌లో రూ.1,921 మాత్రమే వసూలు చేయాల్సి ఉంది.

ఎంత వసూలు చేస్తున్నారంటే..

బాట, లోడింగ్ చార్జీలనే అవకాశంగా తీసుకుని ఇసుక అక్రమార్కులు అదనపు వసూళ్లకు తెర తీశారు. అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం 20 టన్నుల లారీకి రూ.1,921 మాత్రమే చెల్లించాల్సి ఉండగా.. కాంట్రాక్టర్లు నియమించిన వ్యక్తులు అదనంగా రూ.4,579 కలిపి మొత్తం రూ.6,500 చొప్పున గుంజుతున్నారు. అధికారిక ధర కంటే నాలుగు రెట్లు అదనంగా వసూలు చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇదేమిటని ఎవరైనా లారీ డ్రైవర్లు ప్రశ్నిస్తే.. ఇసుక లేదనే జవాబు కాంట్రాక్టరు నుంచి వస్తోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో లారీ డ్రైవర్లు అదనంగా చెల్లించి ఇసుక తీసుకుని వెళ్తున్నారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌లో శనివారం ఇసుక అమ్మకాలు ప్రారంభించడంతో ఉదయం నుంచి సాయంత్రానికి 60 లారీల ఇసుక ఎగుమతి చేశారు. ఒక్కో లారీకి అదనంగా రూ.4,579 చొప్పున 60 లారీలకు కలిపి ఈ ఒక్క రోజే రూ.2,74,740 దండుకున్నారు. లారీల సంఖ్య పెరిగే కొద్దీ అక్రమార్కులు దండిగా సొమ్ము చేసుకోనున్నారు.

డబ్బులిస్తేనే ట్రాక్టర్లకు లోడింగ్

ఇసుక రీచ్‌ల్లో ట్రాక్టర్ల ద్వారా ఎవ్వరైనా ఇసుక ఉచితంగా తీసుకు వెళ్లవచ్చని, ఎవరైనా అడ్డుకుంటే క్షమించేది లేదని ఈ ర్యాంపులను శనివారం సందర్శించిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. ఉచిత ఇసుక అనేది ప్రభుత్వ లక్ష్యమని, దీనికి ఎవరు అడ్డం వచ్చినా కఠినంగా వ్యవహరిస్తానని తెలిపారు. కానీ, తీపర్రు, కానూరు–పెండ్యాల ఇసుక ర్యాంప్‌లలో ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి చేయడం లేదు. దీంతో, ఇసుక అవసరమైన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక కావాలంటే కొనుగోలు చేయాల్సిందేనంటూ ర్యాంప్‌లోకి ట్రాక్టర్లు వెళ్లకుండా నిరోధిస్తున్నారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా అధికారులు ఏమీ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పగలు అధికారికం.. రాత్రి అనధికారికం..

ఇసుక రీచ్‌లలో కేవలం ట్రాక్టర్లతోనే స్టాక్ పాయింట్లకు ఇసుక తరలించాలనే నిబంధనను కాంట్రాక్టర్లు గాలికి వదిలేశారు. రాత్రి వేళల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. కానూరు–పెండ్యాల, జీడిగుంట ర్యాంప్‌లలో పగలంతా అధికారికంగా ట్రాక్టర్లతో ఇసుకను స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. రాత్రయ్యేసరికి యంత్రాలు పెట్టి, లారీలతో యథేచ్ఛగా ఇసుక తోలకాలు జరుపుతున్నారు. దీనిని స్థానికులు అడ్డుకున్నా అధికారులు మాత్రం ఏమీ లేదంటూ వచ్చిన లారీలను వదిలివేస్తున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల కళ్లుగప్పి..

జిల్లా కలెక్టర్ శనివారం ర్యాంప్‌లలో తనిఖీలు చేసిన సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక తవ్వకం చార్జీలు తప్ప ఎక్కువ వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఆమె, అధికారులు ఇలా వెళ్లారో లేదో.. కాంట్రాక్టర్లు వెంటనే లారీల వద్ద 20 టన్నులకు రూ.6,500 వసూలు మొదలు పెట్టేశారు. అంతేకాకుండా శనివారం రాత్రి జీడిగుంటలో పొక్లెయిన్లు, లారీతో ఇసుక తవ్వకాలు జరిపారు. ఇలా 10 లారీలు వస్తుంటే గ్రామస్తులు అడ్డుకుని, అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సెలవులో ఉన్నానని చెప్పారని అంటున్నారు. తహసీల్దార్ వచ్చి తనిఖీలు చేసి, ఆ లారీలు ఖాళీవని ధ్రువీకరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ర్యాంప్‌లలో ప్రతి రోజూ యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు, రాత్రుళ్లు తోలకాలు జరుపుతూంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపిస్తున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత ఎటువంటి ఇసుక తోలకాలు, తవ్వకాలు జరపకూడదనే ఆదేశాలున్నా కాంట్రాక్టర్లు నిబంధనలు గోదాట్లో తొక్కి మరీ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. ఇలా తవ్విన ఇసుకను గుట్టల్లో వేయకుండా, లారీలకు లోడ్ చేసి, అధిక ధరలకు అమ్ముకుని, సొమ్ము చేసుకుంటున్నారు.

ఇంత దారుణమా?



ప్రభుత్వం చెప్పిన ధరలకు ఇసుక పాయింట్ల వద్ద ఎగుమతి చేయటం లేదు. లారీకి అదనంగా రూ.5 వేలు తీసుకుంటున్నారు. ఇవ్వనంటే ఇసుక ఎగుమతి చేయడం లేదు. ఇంత దారుణం ఎక్కడా, ఎప్పుడూ చూడలేదు.

– ఆర్.గణేష్, లారీ డ్రైవర్, భీమవరం

నిలువు దోపిడీ చేస్తున్నారు



కాంట్రాక్టర్ మనుషులు అడిగిన సొమ్ము చెల్లించకపోతే ఇసుక ఇవ్వటం లేదు. రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తోంది. సొమ్ము ఎంత ఎక్కువ ఇస్తే అంత ముందుగా లోడ్ చేస్తున్నారు. ఇసుక కోసం ఇలాంటి పరిస్థితి వస్తుందనుకోలేదు. నిలువు దోపిడీ చేస్తున్నారు.

– వి.సురేష్, లారీ డ్రైవర్, విజ్జేశ్వరం

కార్యకర్తలపై దాడులను సహించం

- ఆస్తులు విధ్వంసం చేస్తే ఊరుకోం
- మాజీ హోం మంత్రి తానేటి వనిత



ధాన్యం గిడ్డంగిని తొలగించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడినా, వారి ఆస్తులను విధ్వంసం చేసినా చూస్తూ ఊరుకోబోమని మాజీ హోంమంత్రి తానేటి వనిత హెచ్చరించారు. నల్లజర్లలో వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లూరి శేషగిరిరావు ఇంటి ముందు 2 సెంట్ల భూమిలో నిర్మించుకున్న ధాన్యం గిడ్డంగిని స్థానిక పంచాయతీ అధికారులతో టీడీపీ నాయకులు ఆదివారం ఉదయం కూలగొట్టించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వనిత నల్లజర్ల వచ్చి బాధిత నాయకుడిని కలుసుకుని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. నోటీసు ఇచ్చి, దానికి సమాధానం ఇచ్చేలోపే 24 గంటలు గడవక ముందే ధాన్యం గోడౌన్‌ను కూలగొట్టారని శేషగిరి ఆమెకు వివరించారు. గత 24 సంవత్సరాలుగా ఆ స్థలం తమ ఆధీనంలోనే ఉందన్నారు. ఈ భూమికి 2004లో రెవెన్యూ శాఖ పట్టా మంజూరు చేసిందన్నారు. గత మే నెల 5న అప్పటి హోం మంత్రి తానేటి వనితపై నల్లజర్లలో మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, ఆయన అనుచరులు దాడి చేసిన సంఘటనలో ప్రధాన సాక్ష్యం చెప్పినందుకు తనపై కక్ష పూరితంగా వ్యవహరించి, ఈ చర్యకు పాల్పడ్డారని వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వనిత మాట్లాడుతూ, 20 సంవత్సరాలుగా శేషగిరి ఆధీనంలో ఉన్న భూమిలో షెడ్డు కూలగొట్టడం కక్షపూరితమేనన్నారు. ఈ స్థలంపై ఆయన హక్కు ఉందా, లేదా అని ప్రశ్నించారు. ఇలా ఏదో ఒక సాకుతో కార్యకర్తలను, నాయకులను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని చెప్పారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్, నాయకులు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, కారుమంచి రమేష్, అప్పసాని నారాయుడు, ముప్పిడి వెంకటరత్నం, రాయుడు విజయకుమార్, మేణ్ణి యువరాజు, అచ్యుతనాగు, కంకిపాటి లక్ష్మణరావు, రవికుమార్ తదితరులున్నారు.

టిఫిన్ కోసం వెళ్లి.. మృత్యు ఒడికి..

- లారీ ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం
- లాలాచెరువులో ఘటన

రాజమహేంద్రవరం రూరల్: టిఫిన్ తినేందుకు వెళుతున్న ఇద్దరు యువకులను లారీ బలిగొంది. లాలాచెరువు స్పిన్నింగ్ మిల్లు సమీపంలో శనివారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం దానవాయిపేటకు చెందిన చుగాని మోహిత్ (19) రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన (ప్రస్తుతం హైదరాబాద్ ప్రగతి నగర్) గుటూరి వెంకన్న ఎలియాస్ అశ్విన్ (24) ప్రైవేటుగా ఆన్‌లైన్ జాబ్ చేస్తూ దానవాయిపేటలోనే ఉంటున్నాడు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా వీరిద్దరూ స్నేహితులయ్యారు. వారం రోజులుగా మోహిత్, వెంకన్న కంబైన్డ్ స్టడీ చేస్తున్నారు. శనివారం రాత్రి చదువుకున్న తర్వాత టిఫిన్ చేసేందుకు వెంకన్న బైక్‌పై దివాన్ చెరువు బయలుదేరారు. లాలాచెరువు స్పిన్నింగ్ మిల్లు వద్దకు వచ్చేసరికి ఎటువంటి సిగ్నల్ లేకుండా ఓ లారీ వేగంగా వచ్చి వీరిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మోహిత్, వెంకన్నలను 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్, ఎస్సై అంకారావు పరిశీలించారు. మోహిత్ తండ్రి రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కగానొక్క కుమారుడు

తమ ఒక్కగానొక్క కుమారుడు మోహిత్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో రాజేష్ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బీటెక్ పూర్తి చేసి, ప్రయోజకుడు అవుతాడనుకున్న కుమారుడు ఇలా దూరమవుతాడని ఊహించలేదని రోదిస్తున్నారు. వెంకన్నకు తల్లిదండ్రులు, చెల్లి ఉన్నారు. ఎదిగివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాడ పడడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.



ఘటనా స్థలంలో మోహిత్, వెంకన్న మృతదేహాలు (ఇన్‌సెట్) మోహిత్ (ఫైల్)

హెల్మెట్ ధరించి ఉంటే..

మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎంతగా చెబుతున్నా యువత పట్టించుకోవడం లేదు. మోహిత్, వెంకన్న విషయంలోనూ ఇదే జరిగింది. హెల్మెట్లు ధరించి ఉంటే వీరు ప్రమాదం నుంచి బయటపడేవారని చూసిన వారంతా చెబుతున్నారు.

యువకుల మృతి బాధాకరం

ఉండ్రాజవరం: విద్యుదాఘాతానికి యువకులు మృతి చెందడం ఎంతో బాధాకరమని, ఈ విషయం తెలిసిన వెంటనే మనసు కలిచివేసిందని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో ఇటీవల సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతూ విద్యుదాఘాతానికి మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఆయన ఆదివారం పరామర్శించారు. యువకులు బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ మృతి చెందగా, ఆ కుటుంబాలకు రూ.25 వేల చొప్పున జోగి రమేష్ స్వయంగా అందించి, ధైర్యం చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావుకు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో ఆ యువకులు చనిపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని, మృతుని భార్యకు ఉద్యోగం కల్పించాలని తన దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు.



తాడిపర్రులో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్

కార్యక్రమంలో గౌడ సంఘ స్టేట్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు, రాష్ట్ర గౌడ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్, తాడిపర్రు ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, ఆ గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, అణగాని రవి, శ్రీశైలం ట్రస్ట్ మాజీ బోర్డు సభ్యుడు కాగిత విజయకుమార్, కృష్ణా జిల్లా గౌడ సంఘ నాయకుడు చిటికెన శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి చెక్కిన అందాల చిత్రం

ప్రకృతి గీసిన ఆ అందాల చిత్రాన్ని చూస్తే ఎవ్వరైనా చిత్తరువు కావాల్సిందే. అప్పటి వరకూ మనసులో ఉన్న అన్ని అలజడులనూ మరచిపోయి.. సంభ్రమంతో అక్కడి ఆనంద జలపాతాల్లో మునిగి తేలాల్సిందే. ఎత్తయిన కొండలు.. వాటిపై దట్టంగా అలముకున్న వనాలు.. జలజలా ప్రవహిస్తూ, ఎత్తు నుంచి కిందకు దూకుతూ.. సహజసిద్ధంగా జాలువారే జలపాతాలు.. ఇటువంటి అందాల ప్రకృతి ఒడిలో అందంగా ఒదిగిపోయిన చూడముచ్చటైన ప్రాంతానికి చిరునామా ధారపల్లి అటవీ ప్రాంతం.

- మైమరపించే వనసౌందర్యం
- చూడచక్కని జలపాతాలు
- భక్తిభావాన్ని పెంపొందించే ఆంధ్రా అరుణాచల క్షేత్రం
- కార్తిక వన విహారానికి కేంద్రంగా దారపల్లి అటవీ ప్రాంతం
- అధిక సంఖ్యలో తరలి వస్తున్న సందర్శకులు



ఎరకంపాలెం జలపాతం వద్ద పర్యాటకుల సందడి



తోటపల్లి జలపాతం వద్ద సందర్శకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోట గ్రామ పంచాయతీ పరిధి ధారపల్లి, ఎరకంపాలెం, తోటపల్లి అటవీ ప్రాంతాలు ప్రకృతి అందాలకు నెలవులు. ఆకాశం నుంచి శివుని శిరస్సు పైకి దూకిన గంగమ్మ.. అక్కడి నుంచి హిమ శిఖరాల మీదుగా నేల మీదకు చేరినట్లు.. దారపల్లి, ఎరకంపాలెం జలపాతాలు గంగావతరణ ఘట్టాన్ని గుర్తుకు తెస్తుంటాయి. ఇవి కార్తిక వన విహారానికి కేంద్రాలుగా ఉన్నాయి. మొన్నటి వరకూ ప్రచారానికి దూరంగా.. స్థానికులు మాత్రమే సేద తీరే ప్రాంతంగా మిగిలిపోయిన ఈ జలపాతాలు.. కొన్నేళ్లుగా పర్యాటకుల్ని, ప్రకృతి ప్రేమికుల్ని ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో జిల్లా నలుమూలల నుంచీ తరలి వస్తున్న యాత్రికులతో ఈ అటవీ ప్రాంతం, ఇక్కడి జలపాతాలు సందడిగా మారుతున్నాయి.

ధారపల్లి

చుట్టూ కొండలు.. జలపాత సవ్వళ్లు.. పక్షుల అరుపులు తప్ప మరో శబ్దం వినిపించే అవకాశం లేని ప్రాంతం ధారపల్లి. ఎనలేని ప్రకృతి సౌందర్యాన్ని తనలో నిక్షిప్తం చేసుకుని, పర్యాటకులను రా..రమ్మని ఆహ్వానిస్తున్నట్టుగా ఉంటుందీ ప్రాంతం. ఇక్కడ కొండ వాలులో ఎంతో ఎత్తు నుంచి వస్తున్న ప్రవాహమే.. జలపాతమై.. స్వచ్ఛమైన నీటితో పరవళ్లు తొక్కుతూ కిందకు దూకుతూ.. సందర్శకులకు కనువిందు చేస్తుంది. పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు ఈ అందాల ప్రదేశం మధురానుభూతిని పంచుతుంది. కనువిందు చేసే దారపల్లి అందాలను తిలకించే యాత్రికుల సంఖ్య రోజు రోజుకూ రెట్టింపవుతోంది. గతంలో మహాశివరాత్రి, కార్తిక వన సమారాధనలకు మాత్రమే పరిమితమైన ఈ ప్రాంతం.. ప్రస్తుతం నిత్యం సందర్శకులతో కళకళలాడుతోంది. జిల్లా నలు మూలల నుంచే కాకుండా రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు ఇక్కడకు తరలి వచ్చి.. ఇక్కడే వంటలు చేసుకొని.. సాయంత్రం వరకూ హరిత వనాల్లో ఆటపాటలతో ఉల్లాసంగా గడుపుతున్నారు. ప్రత్తిపాడు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారికి 18, అన్నవరానికి 35, కాకినాడకు 65 కిలోమీటర్ల దూరంలో దారపల్లి ఉంది. ఉత్తరకంచి గ్రామం వరకూ రహదారి ఉన్నా అక్కడి నుంచి ధారపల్లి వరకూ రోడ్డు అత్యంత అధ్వానంగా ఉండేది. పెద్దిపాలెం నుంచి కిత్తుమూరిపేట వరకూ ఉన్న ఐదు కిలోమీటర్లు రహదారిని పునర్నిర్మించారు. ఉత్తరకంచి – పెద్దిపాలెం, కిత్తుమూరిపేట – ధారపల్లి మధ్య రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. దీనిని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి పర్యాటకులు మరింతగా పెరుగుతారు.

ఎరకంపాలెం

ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి నుంచి 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో అందాల ప్రాంతం ఎరకంపాలెం. ఇక్కడి మల్లిఖార్జునలొద్దులో ఉన్న జలపాతం ప్రకృతి ప్రేమికులను ఎంతో ఆకట్టుకుంటుంది. అన్నవరానికి 36, కాకినాడకు 66 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. పెద్దిపాలెం నుంచి ఇ.గోకవరం మీదుగా ఎరకంపాలెం చేరుకోవచ్చు.

ఆధ్యాత్మిక కేంద్రంగా..

ప్రత్తిపాడు మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరాన.. జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు నుంచి కిలోమీటర్ దూరంలో నెలకొల్పిన శ్రీరమణా సేవాశ్రమంలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం ఆంధ్రా అరుణాచలంగా.. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. మూడున్నర దశాబ్దాలుగా రమణ తత్వాన్ని బోధిస్తున్న శ్రీరమణ సేవాశ్రమం అనేక మందిని ఆధ్యాత్మిక మార్గాన నడిపిస్తోంది. ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి జిల్లా నలు మూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ప్రస్తుత కార్తిక మాసంలో ఈ క్షేత్రానికి భక్తుల తాకిడి మరింత పెరుగుతోంది. ఇక్కడి నుంచి మరో 15 కిలోమీటర్ల దూరంలో తోటపల్లి అటవీ ప్రాంతంలో నెలకొల్పిన శ్రీశాంతి ఆశ్రమం ఆధ్యాత్మికత, సేవాతత్వానికి పెట్టింది పేరుగా నిలిచింది. ఇక్కడకు కొన్ని దశాబ్దాలుగా నిత్యం యాత్రికులు తరలి వచ్చి, తరిస్తుంటారు.

శివోహం



రాచపల్లిలోని ఆంధ్ర అరుణాచల క్షేత్రం

ఈ జలపాతాల దిగువన సాక్షాత్తూ మహాశివుడే లింగరూపుడై కొలువై ఉండటం మరో విశేషం. జలపాతంలో స్నానమాచరించిన భక్తులు.. అనంతరం భారీ రాతి బండల నడుమ గుహలో ఉన్న శివలింగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ధారపల్లి జలపాతం వద్ద శివలింగం పైభాగంలో రాళ్లకు ఉండే సుద్దను విబూదిగా ధరిస్తారు. ఇక్కడ పుణ్యస్నానం ఆచరించి శివుడిని దర్శించుకుంటే సకల పాపాలూ హరిస్తాయని నమ్ముతారు.

ఆకట్టుకునే జలాశయాలు

ఈ జలపాతాలకు దిగువన సుబ్బారెడ్డి సాగర్, కట్టుచింతల ప్రాజెక్టులు ఉన్నాయి. ధారపల్లి, ఎరకంపాలెం జలపాతాల వద్ద విహరించిన పర్యాటకులు ఈ జలాశయాల వద్ద కూడా ఉల్లాసంగా గడుపుతున్నారు. ఒకసారి సందర్శిస్తే మళ్లీమళ్లీ రావలసిందే అనే రీతిలో ఈ ప్రాంతాలు ఆకట్టుకుంటున్నాయి.



చూడచక్కని ధారపల్లి జలపాతం

తోటపల్లి

ఈ ప్రాంతంలోనే ఉన్న మరో ప్రకృతి సౌందర్య ఖని తోటపల్లి. ఇక్కడి జలపాతం కూడా సందర్శకులను కట్టిపడేస్తుంది. ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి నుంచి 17, అన్నవరానికి 33, కాకినాడకు 64 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. ప్రత్తిపాడు నుంచి శాంతి ఆశ్రమం మీదుగా తోటపల్లి జలపాతానికి చేరుకోవచ్చు.

క్లుప్తంగా

శివాయ... సర్వరూపాయ



పెన్సిల్ ముల్లుపై శివుని రూపం



సుద్ద ముక్కపై మహా శివుడు



పెంకే కృష్ణస్వామి

గండేపల్లి: కార్తికం.. పరమ శివునికి ఎంతో ప్రీతికరమైన మాసం. ద్రాక్షారామకు చెందిన ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్సీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెంకే కృష్ణస్వామి పెన్సిల్ ముల్లు, సుద్దముక్క, సబ్బుపై మహాశివుని ప్రతిమను చెక్కి భక్తిని చాటారు. వీటిని తయారు చేసేందుకు రెండు గంటలు పట్టిందని ఆయన తెలిపారు. తోటి అధ్యాపకులు, స్నేహితులు, విద్యార్థులు అభినందించారు.

పిచ్చికుక్క దాడి

నల్లజర్ల: అనంతపల్లిలో ఆదివారం ఓ కూల్ డ్రింక్ షాపు వద్ద పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గురుస్వామి సీతారామస్వామిపై తొలుత దాడి చేసింది. తర్వాత మరో ఆరుగురిని కరిచింది. గ్రామంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఇతర గ్రామాల నుంచి వాహనాల్లో వచ్చి కుక్కలను ఇక్కడ విడిచి పెడుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వీధుల్లో కుక్కలు దాడి చేస్తుండగా, ఇళ్లపై కోతులు దండయాత్ర చేస్తున్నాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఇంట్లో ఉన్న వస్తువులను ఎత్తుకెళుతున్నాయని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

కరిమల వాసా.. పాప వినాశా

- పెరుగుతున్న అయ్యప్ప దీక్షాధారులు
- పరోక్షంగా ఆర్టీసీకి, రైల్వేకు ఆదాయం



పడిపూజకు అందంగా తీర్చిదిద్దిన అయ్యప్ప మండపం (ఫైల్)



పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు (ఫైల్)

రాయవరం: కరిమల వాసా.. పాప వినాశా అంటూ ఆ స్వామిని కొలిచేందుకు అయ్యప్పలు అడుగులు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏటా అయ్యప్ప దీక్షాధారులు పెరుగుతున్నారు. నల్లటి వస్త్రం.. నుదుటన తిలకధారణ, శీతల స్నానంతో అయ్యప్ప భక్తులు మండల రోజులు (41 రోజులు) నియమ నిష్టలతో మాలధారణ చేస్తున్నారు. విజయ దశమి నుంచి అధిక సంఖ్యలో మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు అడుగడుగునా మాల ధరించిన భక్తులు దర్శనమిస్తున్నారు. శబరిమలకు వెళ్లే ఈ భక్తుల ద్వారా ఏటా రైల్వే, ఆర్టీసీకి అధిక ఆదాయం వస్తోంది. మాలధారణ చేసిన అయ్యప్పలు అధికంగా మండల దీక్షలు చేపడతారు. 41 రోజుల పాటు కఠిన నియమ నిష్టలతో ఉంటారు. గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారణ చేసిన అయ్యప్పలంతా ఒకేచోట ఆశ్రమంగా ఏర్పరుచుకుని, పీఠాన్ని ప్రతిష్ఠించుకుని మండల రోజులు దీక్షలు చేపడుతున్నారు. ఒక్కో ఆశ్రమంలో 20 నుంచి 100 మంది వరకూ స్వాములు ఉంటున్నారు. మాల స్వీకరించిన స్వాములంతా శీతల స్నానం, ఏకభక్తం, భూతల శయనం, ఉల్లి, వెల్లుల్లి లేకుండా సాత్విక ఆహారాన్ని తీసుకుంటారు. దీక్షా సమయంలో తులసిమాల, స్పటికల మాల ధరించి, కఠినమైన నిష్టతో బ్రహ్మచర్యం పాటిస్తూ నలుపు దుస్తులను ధరిస్తారు. ఒంటి పూట మితాహారం చేస్తూ నేల మీదే పడుకుంటూ ఉభయ సంధ్యల్లో దేవతార్చన, నిత్యం శరణుఘోష చేస్తూ పూజలు చేస్తుంటారు.

దీక్షలో ఇరుముడి ప్రత్యేకం

మండల దీక్షలో ఇరుముడికి ప్రత్యేకత ఉంది. 41 రోజుల దీక్ష అనంతరం అయ్యప్పలు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని శబరిమలకు పయనమవుతారు. ఇరుముడితో వెళ్లిన అయ్యప్ప స్వాములకే శబరిమలలో 18 మెట్లు ఎక్కే అర్హత ఉంటుంది. ఇరుముడిలో భాగంగా ఒక కొబ్బరి కాయలోని నీరును తీసి దానిలో నెయ్యిని పోస్తారు. దీక్ష పూర్తయ్యాక ఆ కొబ్బరికాయలో వేసిన నెయ్యి గడ్డకట్టితే దీక్ష బాగా చేసినట్లు భావిస్తారు.

ఆకట్టుకునే పడిపూజ

అయ్యప్ప స్వామి దీక్షలో ముఖ్యంగా అయ్యప్పలు చేసే పడిపూజ ప్రతి ఒక్కరినీ అలరిస్తుంది. అరటి బోదెలతో అయ్యప్ప స్వామి గుడిని నిర్మించి పూలు, పండ్లతో అందంగా అలంకరిస్తారు. పడి పూజలో తొమ్మిది, 18, 36, 54, 108 కలశాలతో ఎవరి స్థోమతకు తగ్గట్టుగా వారు పూజలు చేస్తారు. ఇందులో భాగంగా చేసే భజన అనంతరం హారతి కర్పూరం వెలిగించి అయ్యప్ప భక్తులు పడి తొక్కుతారు. గురుస్వామి పాడే పడి పాటకు అనుగుణంగా స్వాములు పడి తొక్కే విధానం ఆకట్టుకుంటుంది.

జిల్లాలో లక్ష మంది స్వాములు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏటా దీక్ష తీసుకునే భక్తుల సంఖ్య పెరుగుతుంది. 35 ఏళ్ల కిందట దీక్ష తీసుకునే అయ్యప్పలు కేవలం వందల సంఖ్యలో ఉంటే, నేడు ఆ సంఖ్య లక్షకు చేరింది. దీక్ష పూర్తయిన భక్తులు నవంబర్ నుంచి జనవరి వరకూ కేరళ రాష్ట్రంలోని శబరిమలకు రైళ్లు, బస్సుల్లో వెళుతుంటారు. అయ్యప్ప భక్తుల్లో 70 శాతం మంది రైళ్లలో వెళ్తున్నారు. ఈ విధంగా జిల్లా నుంచి రైల్వేకు రూ.14 కోట్ల వరకూ ఆదాయం వచ్చే అవకాశముంది. అదేవిధంగా ఆర్టీసీ బస్సులపై స్వాములు శబరిమల యాత్ర చేస్తున్నారు. గతేడాది జిల్లా నుంచి 25 బస్సుల ద్వారా స్వాములు శబరిమలకు వెళ్లగా, ఆర్టీసీకి రూ.49 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 40 బస్సులు నడపాలని లక్ష్యంగా ఆర్టీసీ నిర్ణయించుకుంది. ఏటా పెరుగుతున్న అయ్యప్ప భక్తులకు పలువురు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ద్వారపూడి, అనపర్తి, మండపేట, కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు తదితర ప్రాంతాల్లో అయ్యప్ప ఆలయాల వద్ద స్వాములకు ప్రతి రోజు ఉచితంగా భిక్ష పెడుతున్నారు.

ఏటా మాలధారణ



ఏటా అయ్యప్ప దీక్ష చేస్తున్నాను. గురుస్వామిగా ఏటా స్వాములను తీసుకుని శబరిమల దర్శనానికి వెళ్తున్నాం. మాలధారణతో ఆధ్యాత్మిక భావం పెంపొందుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. పాజిటివ్ థింకింగ్ పెరుగుతుంది.

–పులగం శ్రీనివాసరెడ్డి, గురుస్వామి, రాయవరం

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం ఆర్టీసీ శబరిమలకు ప్రత్యేక బస్ సర్వీసులను నడుపుతోంది. ఏటా భక్తుల సంఖ్య పెరగడంతో సర్వీసులను కూడా పెంచుతున్నాం. గతేడాది 25 బస్సులు శబరిమలకు భక్తులను తీసుకుని వెళ్లగా, ఈ ఏడాది 40 బస్సులు వెళ్లాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. దీనిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ జిల్లా ప్రజా రవాణా అధికారి, అమలాపురం

నియమనిష్టలతో దీక్ష



మాలధారణ చేసే స్వాములు నియమ, నిష్టలతో దీక్షలు చేయాలి. సాధారణ జీవితానికి మాలధారణ చేసే సమయానికి కచ్చితంగా మార్పు ఉంటుంది. ఒక గొప్ప అనుభూతినిస్తోంది. ఎంత నిష్టగా దీక్ష చేస్తే అంత ఫలితం ఉంటుంది.

–మట్టా బాబ్జి, ఇన్‌చార్జ్, జ్ఞాన సరస్వతి అయ్యప్పస్వామి ఆలయం, వాడపాలెం

మనసుకు ప్రశాంతత



అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న భక్తులకు మనసు పరివర్తన, పరిపక్వత చేకూరుతుంది. 41 రోజులు సర్వం త్యజించి స్వామిని ఆరాధిస్తూ మమేకం కావడంతో మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. మాలధారణ చేయడంతో పాటుగా, అయ్యప్పలకు అన్న సమారాధన నిర్వహిస్తున్నాం.

–పెన్మెత్స జగ్గరాజు గురుస్వామి, ముమ్మిడివరం

భీమేశ్వరా.. సర్వేశ్వరా..



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: కార్తిక మాసం ఆదివారం కావడంతో పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధ్వజ స్తంభం, రావిచెట్టు, జమ్మి చెట్టు తులసి చెట్టు, ఉప ఆలయాల వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. స్వామివారికి తొలి అభిషేకం, పూజలను ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు నిర్వహించారు. ఉచిత దర్శనం, రూ.20, రూ.50 రూ.100 టిక్కెట్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం భక్తులకు పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం అన్న ప్రసాదాలను దేవస్థానం ఏర్పాటు చేసింది. భక్తుల రద్దీని పురస్కరించుకుని సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వేట్లపాలెం పీహెచ్‌సీ పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, భక్త సంఘ నాయకులు బిక్కిన సాయి, తలుపుల అంజనీకుమార్, చల్లా సత్తిబాబు, శ్రీను, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు సేవలందించారు.

విజిలెన్స్ దాడులు

కొత్తపల్లి: కొండెవరం శివారున ఇండియన్ ఆయిల్ బంక్ (ఐఓసీ)పై ఆదివారం విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇక్కడ పెట్రోలు బంక్ నిర్వహణ, కొలతలు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. బంక్ ఆవరణలో పార్క్ చేసిన ట్యాంకర్‌లో సుమారు 700 లీటర్ల పెట్రోల్‌కు ఎటువంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఏఎస్‌ఓ ప్రసన్నలక్ష్మీదేవి చెప్పారు. ఈ దాడిలో విజిలెన్స్ సీఐ వెంకట్రావు, ఎంఎస్‌ఓ మమత తదితరులు పాల్గొన్నారు.

దేవుని సాక్షిగా దోపిడీ



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ఫీజుల ఫ్లెక్సీ



ఫిర్యాదు చేసిన భక్తుడి ముందు ఈఓతో వాగ్వాదానికి దిగిన పాటదారుడు చల్లా శ్రీను (సంఘటనను వీడియో తీస్తున్న పాటదారుడి కుమారుడు)

- పార్కింగ్ పేరుతో అధిక వసూళ్లు
- ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో తంతు



అధిక ఫీజులతో ముద్రించిన బిల్లులు

రామచంద్రపురం రూరల్: దేవుని సాక్షిగా దోపిడీ జరుగుతోంది.. పార్కింగ్ పేరుతో అధిక మొత్తం వసూలు చేయడం భక్తులకు భారంగా మారింది.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో పార్కింగ్ పేరుతో జరుగుతున్న తంతు ఇది. ఆ వివరాల్లోకి వెళితే, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. స్వామి దర్శనానికి వాహనాల్లో వచ్చే భక్తుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే హక్కు కోసం ఏటా బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 1 నుంచి ఈ ఏడాది నవంబరు 31 వరకూ వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేసుకునేందుకు చల్లా శ్రీను అనే వ్యక్తి రూ. 13,35,000కు వేలం దక్కించుకున్నారు. అదే సమయంలో నిబంధనల మేరకు ఏ వాహనం నుంచి ఎంత రుసుం వసూలు చేయాలనేది దేవదాయ శాఖ అధికారులు పాటదారులకు తెలియజేయడమే కాకుండా, ఆ రుసుం వివరాలతో ఆలయ ప్రాంగణంలో బోర్డులు ఏర్పాటు చేస్తారు. అయితే ఇక్కడ పాటదారుడు నిబంధనలు మీరి వసూలు చేయాల్సిన రుసుముల కంటే చాలా అధికంగా వసూలు చేస్తూ ఆలయానికి అప్రతిష్ఠ తీసుకొస్తున్నాడని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భారీ వాహనాలైన లారీ, బస్సులకు నిబంధనల ప్రకారం రూ.100 వసూలు చేయాల్సి ఉండగా రూ.250, ట్రాక్టరు, మినీ వ్యాన్లకు రూ.50కు గాను రూ.100 వసూలు చేస్తున్నారు. కారు, వ్యాన్లకు రూ.20 వసూలు చేయాల్సి ఉండగా చిన్న కారు, 7 సీటర్ కారు అని విడదీసి రూ. 40, రూ. 50 వసూలు చేస్తున్నారు. ఆటోలకు రూ. 15 వసూలు చేయాల్సి ఉండగా రూ. 30 చెల్లించమంటున్నారు. మోటారు సైకిల్‌కు రూ.10కు ఉండగా రూ. 20 తీసుకుంటున్నారు. ఆలయం పేరిట అధిక ధరలకు పార్కింగ్ ఫీజులు ముద్రించిన బిల్లులను ముద్రించి దర్జాగా దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం ఖమ్మం నుంచి వచ్చిన ఒక భక్తుడు బోర్డులో పెట్టిన ఫీజు కాకుండా అధికంగా వసూలు చేయడంపై పాటదారుడితో వాగ్వావాదానికి దిగారు. ఆ పంచాయితీ కాస్తా ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని వద్దకు చేరింది. దీనిపై అడిగినందుకు పాటదారుడు తనపై ఆవేశంగా మాట్లాడారని, ఈ మేరకు ద్రాక్షారామ ఎస్సైకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

మందలించినా అక్రమ వసూళ్లే



భక్తుల నుంచి అధికంగా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అధికం కావడంతో అనేక సార్లు మందలించాను. పార్కింగ్ ఫీజులు ఎంత అనే వివరాలను ఆలయం ముందు, వెనుక వైపు కూడా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాం. ఆ బోర్డులు కూడా మాయం చేయడంతో మళ్లీ వారితోనే బోర్డులు పెట్టించాం. ఈ నెలాఖరుకు ఆ పాటదారుడి గడువు తీరిపోతోంది. ఇప్పటికే దేవాలయానికి సుమారు రూ.8 లక్షల వరకూ బకాయి పడ్డారు. ఆ సొమ్ము విషయం, అధిక ఫీజులు వసూలు చేసే అంశాలపై ఉన్నతాధికారులకు నివేదించి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

–అల్లు వెంకట దుర్గాభవాని, ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈఓ

రెడ్డి అనేది కులం కాదు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- అన్ని కులాల సంక్షేమాన్ని కాంక్షించే వ్యవస్థ
- మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రెడ్డి అనేది ఒక కులం కాదని, అన్ని కులాల సంక్షేమాన్ని ఆకాంక్షించే ఓ వ్యవస్థ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో కోస్తా ఆంధ్రా రెడ్డి సంక్షేమ సంఘం, కోస్తా ఆంధ్రారెడ్డి హెల్త్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్తిక వన సమారాధనలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో లక్కీడిప్‌లో విజేతలకు బహుమతులను మాజీ ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఈ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి, మాచర్ల, కనిగిరి ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, సెంట్రల్ కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ చింతకుంట శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి



మద్దిపాటి శ్రీరాములు మృతదేహం

నిడదవోలు రూరల్: గోదావరి దాటుతూ నీటమునిగి వ్యక్తి మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలేనికి చెందిన మద్దిపాటి శ్రీరాములు (54) నిడదవోలు మండంల పెండ్యాల నుంచి ఆదివారం మధ్యాహ్నం గోదావరి దాటుకుంటూ ఇంటికి వెళుతుండగా మద్యం మత్తులో ఈత కొట్టలేక నీట మునిగి మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంట మార్పిడి.. మేలైన దిగుబడి

- చీడపీడల నుంచి రక్షణ
- భూసారం పెంపు
- ఎరువులు, పురుగు మందుల ఖర్చు ఆదా
- సమీకృత వ్యవసాయంపై రైతులకు అవగాహన
- రబీలో శ్రీకారం చుట్టేందుకు అధికారుల సన్నాహాలు



పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పాడి-పంట

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రైతులు ప్రతిసారీ ఒకే రకం పంటను మళ్లీ మళ్లీ సాగు చేస్తూండటంతో భూసారానికి ముప్పు వాటిల్లుతోంది. ముఖ్యంగా కొన్ని వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉండటంతో రైతులు అదే పంటను అదే పొలంలో ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. దీనివలన భూసారం క్షీణించడంతో పాటు చీడపీడలు విజృంభించడంతో రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. మరోవైపు పంట దిగుబడులు కూడా క్రమేపీ తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీనిని అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం మేలని, దీనివలన భూసారం పెరిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఖర్చులు కూడా తగ్గుతాయని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్నో లాభాలు

రెండు మూడేళ్లకోసారైనా పంట మార్పిడి చేస్తే చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించే చీడపీడలు రెండో పంటను ఆశించవు. పంట మార్పిడి విధానంలో రెండు మూడు పంటలు పండించడం వల్ల ఏదైన ఒక పంటకు గిట్టుబాటు ధర దక్కకపోయినా ఇతర పంటల వల్ల తగిన లాభం పొందే అవకాశం ఉంటుంది. అంతే కాదు.. దిగుబడి కూడా పెంచుకోవచ్చు. రైతులందరూ ఒకే రకమైన పంట సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటోంది. ఫలితంగా దిగుబడి తగ్గడమే కాకుండా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. పంట మార్పిడి వల్ల సస్యరక్షణ కోసం వాడే పురుగు మందుల ఖర్చు కూడా ఆదా అవుతుంది.

ఇలా చేస్తే మేలు

- భూమిలో తక్కువ లోతుకు వేర్లు చొచ్చుకుపోయే పైర్లను, వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే పైర్లతో మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ, పోషకాలను మొక్కలు సమర్థంగా వినియోగించుకుంటాయి.
- పత్తి సాగు చేసిన పొలంలో మిరప పంట వేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- మిరప సాగుకు ముందు భూమిలో జనుము, పిల్లిపెసర వంటివి సాగు చేసి, ట్రాక్టర్ ద్వారా తొక్కిస్తే భూసారం పెరిగి, చీడపీడలు దరి చేరవు.
- నులిపురుగులున్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. అవి వేస్తే పురుగులు మరింత వృద్ధి చెందుతాయి.
- నేలంతా పూర్తిగా కప్పే వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము వంటి పంటలనే పంట మార్పిడికి ఎంచుకోవాలి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి తర్వాత పప్పుధాన్యాలు లేదా నూనె గింజల పంటలు సాగు చేస్తే వరిని తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలు సాగు చేసుకోవచ్చు.
- కంది సాగు వల్ల ఆ పైరు ఆకులు రాలి కుళ్లడంతో నేలలో సేంద్రియ పదార్థం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది.
- వేరుశనగ, కంది, పప్పుశనగ వంటి వాటి వేర్ల బుడిపెల్లో రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్థిరీకరించి, నేలను సారవంతం చేస్తుంది.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



రైతులు సమీకృత వ్యవసాయం చేపట్టేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే ఐదారు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పంట మార్పిడి వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నాం.

– ఎస్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సమీకృత వ్యవసాయం చేపట్టేలా..

రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ శాస్త్రవేత్తలతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఒక ఎకరం భూమిలో ఫిష్ కల్చర్, వరి, కోళ్ల ఫామ్, కూరగాయలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేసుకోవచ్చు. వరి పంట కాలం సుమారు 120 నుంచి 150 రోజులు. అదే చిరుధాన్యాలు సాగు చేస్తే 90 రోజుల్లోనే పంట కాలం పూర్తవుతుంది. ఫలితంగా ఏడాదికి మూడు పంటలు వేసుకోవచ్చు. ఇలా ఎకరానికి పెట్టుబడి పోను రూ.50 వేల నుంచి రూ.60 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. అదే వరి సాగు చేస్తే రెండు సీజన్లు కలిపి రూ.25 వేలు మాత్రమే మిగులుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో అన్ని మండలాల్లోనూ సమీకృత వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.